నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, మంగళవారం 29 అక్టోబర్ 2024 | SURYAPET

చలో సచివాలయానికి తరలిన బెటాలియన్ కానిస్టేబుళ్లు

నీలగిరి, అక్టోబర్ 28 : బెటాలియన్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ నిర్వహిస్తున్న ఆందోళనలో భాగంగా సోమవారం నిర్వహించిన చలో సచివాలయం కార్యక్రమానికి అన్నెపర్తి 12వ బెటాలియన్ కానిస్టేబుళ్లు తరలి వెళ్లారు. తమ డిమాండ్ల సాధనకు ఆందోళన చేస్తున్న బెటాలియన్ పోలీసుల్లో గతంలో 39 మందిని, ఆదివారం రాత్రి మరో 10 మందిని సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా అన్నెపర్తి బెటాలియన్‌లో ఐదుగురిని సస్పెండ్ చేయడంతో పాటు ఇద్దరిని సర్వీస్ నుంచి తొలగించారు. తొలగించిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ అన్నెపర్తి నుంచి సుమారు 150 మంది కానిస్టేబుళ్లు, వారి కుటుంబ సభ్యులు చలో హైదరాబాద్‌కు కార్యక్రమానికి వెళ్లారు. ఈ సందర్భంగా పలువు మాట్లాడుతూ శాంతి యుతంగా ధర్నా చేస్తున్న కానిస్టేబుళ్ల సమస్యలు పరిష్కరించాల్సింది పోయి బెదిరింపు ధోరణిలో వారిని సస్పెండ్ చేయడం దారుణమన్నారు. సమస్యలు పరిష్కరించి ఒకే రాష్ట్రం ఒకే పోలీస్ విధానం అమలు చేసేంత వరకు ఆందోళన విరమించేది లేదన్నారు.

నల్లగొండ కలెక్టర్‌గా ఇలా త్రిపాఠి

ప్రస్తుత కలెక్టర్ సి.నారాయణరెడ్డి బదిలీ

బాధ్యతలు స్వీకరిస్తున్న నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

- ఏడాదిలోపే జిల్లాకు మూడో కలెక్టర్
- పాలనపై పట్టు బిగించే లోపే బదిలీలు
- అయోమయంలో అధికార యంత్రాంగం
- అనతికాలంలోనే జిల్లాపై నారాయణరెడ్డి మార్క్

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్28(నమస్తే తెలంగాణ) : నల్లగొండ జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నూతన కలెక్టర్‌గా టూరిజం శాఖ డైరెక్టర్‌గా పని చేస్తున్న 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఇలా త్రిపాఠీని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. లక్నోకు చెందిన ఇలా త్రిపాఠీ 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. ముందుగా కేంద్ర సర్వీసుల్లో భాగంగా ఢిల్లీలో అసిస్టెంట్ కలెక్టర్‌గా పని చేశారు. తర్వాత మంచిర్యాలలో అసిస్టెంట్ కలెక్టర్‌గా 2020 వరకు విధులు నిర్వర్తించారు. అక్కడి నుంచి 2020లో ములుగు కలెక్టర్‌గా భాధ్యతలు చేపట్టి 2024 జూన్ 15 వరకు పని చేశారు. జిల్లా కలెక్టర్‌గా మేడారం సమక్క సారలమ్మ జాతరను విజయవంతంగా జరిపించారు. కాగా, నల్లగొండ జిల్లాకు ఒక్క ఏడాదిలోనే ముగ్గురు కలెక్టర్లు మారడం చర్చనీయాంశంగా మారింది. కలెక్టర్లుగా వచ్చిన వారూ... అలా వచ్చి కుదురుకుని జిల్లా పాలనపై పట్టు సాధించేలోపే ఆకస్మికంగా మార్చేయడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మెరుగైన పాలన కోసమా అంటే అదీ లేదని చెప్పవచ్చు. ఈ ఏడాది జనవరి 3న కలెక్టర్లను ప్రభుత్వం పెద్దఎత్తున బదిలీ చేసింది. ఆ సమయంలో నల్లగొండ కలెక్టర్‌గా 2010 బ్యాచ్ ఐఏఎస్‌కు చెందిన దాసరి హరిచందన అదే నెల 8న బాధ్యతలు చేపట్టారు. ఆమె వచ్చాక వరుస ఎన్నికలతోనే సరిపోయింది. ఎంపీ ఎన్నికలు ముగిసిన వెంటనే హరిచందన బదిలీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జూన్ 15న ఐఏఎస్‌ల బదీల్లో భాగంగా ఆమె స్థానంలో వికారాబాద్ కలెక్టర్‌గా ఉన్న సి.నారాయణరెడ్డి(2015 బ్యాచ్ ఐఏఎస్) బదిలీపై వచ్చారు.

చింతకుంట నారాయణరెడ్డి ఎక్కడ పని చేసినా ఆ జిల్లాల పాలనలో తనదైన ముద్రతో పని చేస్తారనే పేరుంది. నల్లగొండ కంటే ముందు ములుగు, నిజామాబాద్, వికారాబాద్ కలెక్టర్‌గా పని చేసిన ఆయన ఇక్కడా పాలనలో తన మార్క్‌ను చూపారు. నల్లగొండ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే ప్రభుత్వ వైద్యం, విద్యా రంగం, రెవెన్యూ విభాగాలకు ప్రాధాన్యమిస్తూ సంస్కరణలు చేపట్టారు. ముఖ్యంగా జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మెరుగైన వైద్య సేవల కోసం తపించారు. ఆ తర్వాత ప్రభుత్వ విద్యా సంస్థలపైనా దృష్టి సారించి పాఠశాలలు తనిఖీలు చేస్తూ నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేశారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులపైనా ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రంలోనే అత్యధిక ఫైళ్లను స్పెషల్ డ్రైవ్ ద్వారా క్లియర్ చేసి రెవెన్యూ సమస్యల పరిష్కారంలోనూ తనదైన ముద్ర వేశారు. దాంతోపాటు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేస్తూ ప్రభుత్వ కార్యాలయాల్లో పరిస్థితిని మెరుగుపరిచే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో తొలిసారిగా గ్రామ, తర్వాత మండల స్థాయిలోనూ గ్రీవెన్స్ సెల్‌లు ఏర్పాటు చేసి స్థానికంగానే ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపారు. ఇలా ఒక్కో పాలన అంశంలో తనదైన ముద్రతో ముందుకు సాగుతున్న క్రమంలోనే నారాయణరెడ్డిని సైతం జిల్లా నుంచి బదిలీ చేయడం విస్మయానికి గురి చేస్తున్నది. జిల్లాపై పట్టు సాధించి పాలనాపరమైన అంశాలపై దృష్టి సారిస్తున్న క్రమంలోనే కలెక్టర్లను మార్చడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో హరిచందన 5 నెలల 7 రోజుల పాటు కలెక్టర్‌గా పని చేస్తే... నారాయణరెడ్డి 4 నెలల 12 రోజుల పాటు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించడం గమనార్హం.

తనదైన ముద్రతో....

బీజేపీ, కాంగ్రెస్‌వి డైవర్షన్ రాజకీయాలు

- కేటీఆర్, ఆయన కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదు
- మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

యాదగిరిగుట్ట, అక్టోబర్28 : రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కలిసి డైవర్షన్ రాజకీయాలకు తెర తీశారని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ విమర్శించారు. ఆరు గ్యారెంటీలతో పాటు రైతులకు రైతుబంధు, రుణమాఫీ, మహిళలకు ఇచ్చిన హామీలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించినందుకు ఆయనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఈ మేరకు సోమవారం భిక్షమయ్యగౌడ్ పత్రికా ప్రకటన విడుదల చేశారు. మాజీ మంత్రి కేటీఆర్ బావమరిది తన ఇంట్లో దావత్ చేసుకుంటే రాజకీయ కుట్ర కోణంలో రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ కుమ్మకై ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల్లో బీఆర్ఎస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు సాగుతున్నాయని మండి పడ్డారు. మాజీ మంత్రి కేటీఆర్ మచ్చలేని నాయకుడని, విదేశాల్లో విద్యనభ్యసించి ఇక్కడి ప్రాంతానికి విదేవీ పెట్టుబడులను తీసుకొచ్చిన ఘనత ఆయనదని తెలిపారు. ఓటుకు నోటు తోపాటు అనే క అక్రమాలకు పాల్పడిన సీఎం రేవంత్‌రెడ్డి.. కేటీఆర్‌పై ఆరోపణలు చేస్తే సహించేదని లేదన్నారు. ప్ర జలను తప్పుదోవ పట్టించి కేటీఆర్ కుటుంబాన్ని అ భాసుపాలు చేసే కుటిల ప్రయత్నానికి రేవంత్‌రెడ్డి దిగాడని పేర్కొన్నారు. కేటీఆర్‌పై ఆరోపణలు చేస్తే బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు ఊరుకోరని తెలిపారు. ఈ దుశ్చర్యను బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ముక్తకంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు.

రెవెన్యూ అధికారుల బదిలీలు

- అదనపు కలెక్టర్‌తోపాటు ఆర్డీఓలకు స్థాన చలనం

నల్లగొండ, అక్టోబర్ 28 : రెవెన్యూ విభాగంలో పలు హోదాల్లో పని చేస్తున్న అధికారులను బదిలీ చేస్తూ సీసీఎల్ఏ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నల్లగొండ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పని చేస్తున్న పూర్ణచంద్రతోపాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, పలువురు ఆర్డీఓలు బదీలీ అయ్యారు. వారంతా మంగళవారం రిలీవ్ కానుండగా, ఇతర జిల్లాల నుంచి వారి స్థానంలో రానున్న అధికారులు నేడో, రేపో విధుల్లో చేరనున్నారు.

పేరు	ప్రస్తుతం పని చేస్తున్న స్థానం	బదిలీ స్థానం
పూర్ణచంద్ర	స్థానిక సంస్థల అదనపు కలెక్టర్	రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యుడు
అమరేందర్	ఆర్డీఓ భువనగిరి	డీఆర్ఓ నల్లగొండ
రాజ్యలక్ష్మి	డీఆర్ఓ, నల్లగొండ	హెచ్ఎండీఏ
ఎన్ రవి	ఆర్డీఓ, నల్లగొండ	స్పెషల్ కలెక్టర్, వరంగల్
అశోక్ రెడ్డి	ఓఆర్ఆర్ స్పెషల్ కలెక్టర్, హెచ్ఎండీఏ	ఆర్డీఓ, నల్లగొండ
సుబ్రహ్మణ్యం	ఎస్‌డీసీ, ఆర్‌అండ్‌ఆర్-నల్లగొండ	ఆర్డీఓ, వనపర్తి
రమణారెడ్డి	డిప్యూటీ కలెక్టర్(వెయిటింగ్)	ఆర్డీఓ, దేవరకొండ
శ్రీరాములు	ఆర్డీఓ దేవరకొండ	ఎస్‌డీసీ, గోదావరిఖని

పోలీసు అమరుల త్యాగాలను స్మరించుకోవాలి

- డ్రగ్స్‌తో యువత భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు
- 2కే రన్‌లో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 28 : విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించగా ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రజలు, పోలీసుల మధ్య సత్సంబంధాలు మెరుగుపడడానికి దోహద పడుతాయన్నారు. డ్రగ్స్, గంజాయి చాలా ప్రమాదకరమైనవని, యువత వీటికి దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్‌తో మానసిక ఒత్తిడిని దూరమవుతారు అనేది ఒట్టి అపోహ అని, క్రమంగా ఆరోగ్యం, భవిష్యత్ దెబ్బతింటాయని హెచ్చరించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నిర్మూలన అందరి భాగస్వామ్యం ఉండాలన్నారు. అనంతరం 2కే రన్‌లో మొదటి బహుమతి జి.నవీన్, సెకండ్ విన్నర్ బి.తరుణ్ (ప్రతిభ జూనియర్ కళాశాల), మూడో బహుమతి సాధించిన ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ సతీష్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నాగేశ్వర్‌రావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్ధన్‌రెడ్డి, సూర్యాపేట డివిజన్ డీఎస్పీ రవి, ఏఆర్ డీఎస్పీ నరసింహ చారి, సీఐలు రాజశేఖర్, సురేందర్‌రెడ్డి, ఆర్ ఐ నారాయణరాజు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, యువత, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యాపేటలో 2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

యాదాద్రి కలెక్టర్‌గా ఎం.హనుమంతరావు

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా ఎం.హనుమంతరావు బదిలీపై వచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు ఆయన రాష్ట్ర సమాచార శాఖలో స్పెషల్ సెక్రటరీగా పని చేశారు. జిల్లాలో పనిచేసిన హనుమంతు కే జెండగే టూరిజం శాఖ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. రాష్ట్ర దేవాదాయశాఖ డైరెక్టర్‌గానూ ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. గతేడాది అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డిని ఎన్నికల కమిషన్ బదిలీ యగా, ఆయన స్థానంలో 2023 అక్టోబర్ 13న జెండగే బాధ్యతలు స్వీకరించారు. సరిగ్గా ఏడాదిపాటు జిల్లాలో పనిచేశారు. వరుసగా జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో సమర్థవంతంగా పని చేశారు. ఎం. హనుమంతరావు ప్రస్తుత కలెక్టర్ హనుమంతు కె.జెండగే నుంచి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

రామన్నపేటలో విద్యార్థులతో కలిసి రాస్తారోకో చేస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి అనుమతులు ఇవ్వద్దు

- రామన్నపేటలో బీసీ విద్యార్థి సంఘం రాస్తారోకో

రామన్నపేట, అక్టోబర్ 28 : మండల కేంద్రంలో అదానీ గ్రూప్ ఏర్పాటుచేయాలని చూస్తున్న అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని అనుమతులు ఇవ్వదని బీసీ విద్యార్థి సంఘం ఆందోళనకు దిగింది. సోమవారం మండల కేంద్రంలోని చిట్యాల-భువనగిరి రోడ్డుపై రాస్తారోకో చేపట్టింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొల్ల మోదీరాందేవ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే సిమెంట్ పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేయొద్దన్నారు. పర్యావరణ నిబంధనలను తుంగలో తొక్కి పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆందోళనలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ నల్ల నరేందర్, బీజేవైఎం నాయకులు అక్కెనపల్లి సైదులు, బీసీ యువజన సంఘం జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, డీఎస్పీ మండల అధ్యక్షుడు అశోక్, నకిరేకంటి నరేందర్, బర్ల దీలీప్, మేడి మల్లేశ్ పాల్గొన్నారు.

బుద్ధడి పాదాలకు పుష్పాంజలి ఘటిస్తున్న బౌద్ధ గురువులు

బుద్ధవనాన్ని సందర్శించిన బౌద్ధ గురువులు

నందికొండ, అక్టోబర్ 28 : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనాన్ని సోమవారం వివిధ బౌద్ధ విహారాలకు చెందిన బౌద్ధ గురువులు సందర్శించారు. బుద్ధడి పాదాలకు పుష్పాంజలి ఘటించారు. జాతకపార్కు, స్థూపపార్కు, అవకానబుద్ధ, మహాస్థూపాన్ని సందర్శించారు. ధ్యానమందిరంలో ప్రార్థనలు నిర్వహించి, ధ్యానం చేశారు. సికింద్రాబాద్‌లోని మహాబోధి బుద్ధ విహారంలో నిర్వహించిన చివర దాన వేడుకల్లో పాల్గొన్న బౌద్ధ గురువులు బుద్ధవనం మెంటార్ చెన్నూరి ఆంజనేయరెడ్డి ఆహ్వానం మేరకు బుద్ధవనాన్ని సందర్శించారు. కార్యక్రమంలో అస్సాం బర్మా కియాల్ బుద్ధ విహార్‌కు చెందిన బౌద్ధ గురువు ఎటిక మహాతెరో, బెంగుళూరు మహాబోధి బుద్ధ విహార్‌కు చెందిన ఆనంద్, బుద్ధదత్త సంఘపాల, బుద్ధపాల బంతేలు, బుద్ధవనం స్తపతి హరిప్రసాద్, బుద్ధవనం డిజైన్ ఇన్‌చార్జి శ్యాంసుందర్, స్థానిక గైడ్ సత్యనారాయణ, సూపర్ వైజర్ విష్ణు పాల్గొన్నారు.

అంబుజాపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం

రామన్నపేట, అక్టోబర్ 28 : రామన్నపేటలో అంబుజా సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేయొద్దంటూ సిరిపురం మాజీ ఎంపీటీసీ రాపోలు నర్సింహ, సామాజిక కార్యకర్త గంజి రమేశ్ హైకోర్టును ఆశ్రయించారు. సోమవారం రిజిస్ట్రర్ పోస్టు ద్వారా ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. హైకోర్టు న్యాయమూర్తికి రాసిన లేఖలో రామన్నపేట కొమ్మాయిగూడెం, సిరిపురం, గ్రామాల మధ్య సిమెంట్ పరిశ్రమ ప్రతిపాదిత స్థలం ఉందన్నారు. ఇక్కడ సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే మండలంలోని 12గ్రామాల ప్రజలు అనారోగ్యం పాలవుతారని, రైతులు, గీత, నేత కార్మికులు, గొర్రెల పెంపకం దారులు, మత్స్యకార్మికులు ఉపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

రిజిస్టర్ పోస్టు ద్వారా పిల్ పంపిస్తున్న నాయకులు

వైయూడీఏ

యాదాద్రి భువనగిరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ

- రెండు మున్సిపాలిటీలు, 10 మండలాలతో ఏర్పాటు
- జీఓ జారీ చేసిన మున్సిపల్ శాఖ
- పంచాయతీలకు గడ్డు కాలమేనా?
- ఏ పని కావాలన్నా అథారిటీని ఆశ్రయించాల్సిందే..
- హెచ్ఎండీఏలోకి తుర్కపల్లి, సంస్థాన్ నారాయణపురం మండలాలు?



యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో కొత్తగా యాదాద్రి భువనగిరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వైయూడీఏ) ఏర్పాటైంది. ఈ మేరకు ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.దానకిశోర్ జీఓ జారీ చేశారు. అథారిటీలో రెండు మున్సిపాలిటీలు, 144 గ్రామాలను విలీనం చేశారు. దాంతో మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు నామమాత్రంగా మారనున్నాయి. జిల్లాలో ఇప్పటికే హెచ్ఎండీఏ, వైటీడీఏ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు దగ్గరలో ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లాలో అధిక శాతం అర్బన్ ఏరియా ఉంది. 17 మండలాలు, ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో కొన్ని హెచ్ఎండీఏ, వైటీడీఏ పరిధిలో ఉన్నాయి. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా జిల్లా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. హెచ్ఎండీఏతో హైదరాబాద్ పరిసర ప్రాంతాలు అభివృద్ధి చెందాయని ఉదాహరణగా చూపిస్తూ యుడా ఏర్పాటు చేయాలని భావించినట్లు జీఓలో పేర్కొన్నారు. యుడాలో రెండు మున్సిపాలిటీలు, 10 మండలాల్లోని 144 గ్రామాలను కలిపారు. ఆలేరు, మోత్కూరు మున్సిపాలిటీతోపాటు యాదగిరిగుట్టలోని 10 గ్రామాలు, అడ్డగూడూరులో 10, ఆలేరు మండలంలో 8, ఆత్మకూర్ (ఎం)లో 15, మోత్కూరులో 9, రాజాపేటలో 19, రామన్నపేటలో 19, వలిగొండలో 26, మోటకొండూర్‌లో 10, గుండాలలో 17 గ్రామాలను విలీనం చేశారు. ఇప్పటికే వైటీడీఏ పరిధిలో యాదగిరిగుట్ట మున్సిపాలిటీతోపాటు యాదగిరిగుట్ట, భువనగిరి మండలాల్లోని కొన్ని గ్రామాలు ఉన్నాయి.

పంచాయతీలకు గడ్డు కాలమేనా?

ఇప్పటికే తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న గ్రామ పంచాయతీలు అథారిటీ ఏర్పాటుతో ఇంకింత గడ్డు పరిస్థితులు ఎదురుకానున్నాయి. గ్రామపంచాయతీల్లో భవన నిర్మాణ అనుమతుల నుంచి వచ్చే బెటర్‌మెంట్, డెవలప్‌మెంట్ ఫీజులు ఇప్పటి వరకు పంచాయతీల ఖాత్లానే జమ అవుతున్నాయి. ఇప్పుడు అథారిటీ ఏర్పాటు చేయడంతో డబ్బులన్నీ యుడా ఖాతాలోకి వెళ్లనున్నాయి. దాంతో పంచాయతీల ఆదాయం తగ్గిపోతుంది. కేవలం ఆస్తి పన్నులు, చెత్త సేకరణ యూజర్ చార్జీలపై ఆధారపడాల్సి ఉంటుంది. పంచాయతీలు అనుమతులు ఇవ్వడానికి అథారిటీ చట్టాలు ఒప్పుకోవు. ఇక ఇప్పుడు ఏ పని కావాలన్నా అథారిటీని ఆశ్రయించాలి. గ్రామాల్లో చిన్న ఇల్లు కట్టుకోవాలన్నా అథారిటీలో దరఖాస్తు చేసుకోవాలి.

తుర్కపల్లి, నారాయణపురం ఎటు!

జిల్లాలోని 17 మండలాలకు గానూ 10 యుడా, 5 హెచ్ఎండీఏలో పరిధిలోకి వెళ్లాయి. హెచ్ఎండీఏలో భువనగిరి, బీబీనగర్, బొమ్మలరామారం, భూదాన్‌పోచంపల్లి, చౌటుప్పల్ మండలాలతోపాటు భువనగిరి, పోచంపల్లి, చౌటుప్పల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇక సంస్థాన్ నారాయణపురం, తుర్కపల్లి మండలాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. వీటిని ఇలాగే కొనసాగిస్తారా, లేదా హెచ్ఎండీఏలో కలుపుతారా అనేది తెలియాల్సి ఉంది. అయితే ఉన్నతాధికారులు మాత్రం హెచ్ఎండీఏలోకి మార్చాలని ప్రతిపాదనలు పంపించినట్లు తెలిసింది.

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

- కుప్పలు పోసి పడిగాపులు గాస్తున్న రైతులు
- లారీల్లో లోడ్ చేసిన ధాన్యం త్వరగా దిగుమతి కాకపోవడమే కారణం
- ప్రభుత్వ నిబంధనలతో సేకరించేందుకు స్థానిక మిల్లర్లు వెనుకడుగు
- చౌటుప్పల్, వివిధ ప్రాంతాల్లో రైతుల ఇబ్బందులు

చౌటుప్పల్ మార్కెట్ యార్డులో పేరుకుపోయిన వడ్ల కుప్పలు

చౌటుప్పల్, అక్టోబర్ 28 : రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. కొనుగోళ్లు కేంద్రాలు ప్రారంభించి రోజులు గడుస్తున్నా ధాన్యం తూకం వేయడంలో స్పీడ్ పెరుగడం లేదు. దాంతో కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు గాస్తున్నారు. మరోవైపు అకాల వర్షాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ మార్కెట్‌లో ఇప్పటివరకు 119 మంది రైతులు ధాన్యం కుప్పలు పోశారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇక్కడ కొనుగోళ్లు ప్రారంభమై మూడు రోజులు గడుస్తున్నా.. కేవలం 8 మంది రైతుల కుప్పలు మాత్రమే తూకం వేశారు. ప్రతి నిత్యం ఇద్దరు ముగ్గురు రైతులకన్నా ఎక్కువ ధాన్యం కొనడం లేదు. చౌటుప్పల్ మండల వ్యాప్తంగా 17 వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇదే పరిస్థితి. ఈ ఆలస్యానికి ప్రధానంగా లారీల్లో ధాన్యం దిగుమతి కాకపోవడమే కారణమని అధికారులు అంటున్నారు. వాటి సమస్యతోనే ధాన్యం తూకం నెమ్మదిగా జరుగుతున్నదని చెప్తున్నారు. గతంలో స్థానిక మిల్లర్లు ధాన్యం సేకరించేది. ప్రస్తుతం వారికి కొంత డిపాజిట్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో మిల్లర్లు ధాన్యం సేకరించేందుకు ముందుకు రావడం లేదని సమాచారం. దీంతో ధాన్యాన్ని సివిల్ సప్లై గోదాములకు తరలిస్తున్నారు. అక్కడ జిల్లా నలుమూలల నుంచి లారీలు రావడంతో త్వరితగతిన ఖాళీ కాకపోవడంతో ఈ సమస్య మరింత పెరిగింది. ప్రభుత్వం స్పందించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం తెచ్చి నెల దాటింది

నేను నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశా. చౌటుప్పల్ మార్కెట్ యార్డ్‌లోని కొనుగోలు కేంద్రానికి నెల రోజుల కిందట ధాన్యాన్ని తీసుకొచ్చిన. మిగతా వ్యవసాయ పనులు వదులుకొని రోజంతా ఇక్కడే ఉంటున్నా. దసరా పండుగ తర్వాత వానలకు కూడా వడ్లు తడిస్తే కూలీలను పెట్టి ఆరబెట్టిన. ఇందుకు 10వేల రూపాయల ఖర్చు వచ్చింది. ఇప్పటి కూడా రోజంతా ఆరబెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నా.

-ఏనుగు నర్సిరెడ్డి, రైతు, చౌటుప్పల్

రాంత్రింబవళ్లు వడ్లకాడనే ఉంటున్నం

వడ్లు తెచ్చి నెల దాటింది. ఇంకా మా లైన్ రాలేదు. కనీసం మాయిశ్చర్ కూడా చూడలేదు. రాత్రింబవళ్లు వడ్లకానే కావలి కాస్తున్నం. వాన భయంతో వడ్లు ఆరబోస్తున్నం. మబ్బులు వస్తే పరదాలు కప్పుతున్నం. ఇంతకు ముందు వాన వచ్చి ధాన్యం తడిస్తే మిషన్లతో ఎండబోసి పడితే రూ. 20వేల వరకు ఖర్చు వచ్చింది. ఇకనైనా మా వడ్లు కొనాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నం.

-దుర్గం మల్లమ్మ, రైతు, చిన్నకొండూర్, చౌటుప్పల్